క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండ టౌన్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈనెల 19న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కాజీపేట, సోమిడి, విష్ణుపురి, రహమత్‌నగర్, వెంకటాద్రినగర్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు, దర్గా, బియాబానీ నగర్, గాంధీనగర్, హౌసింగ్‌బోర్డు కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హసన్‌పర్తి: చింతగట్టు స్టేషన్ పరిధిలోని భీమారం ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కుమ్మరిగూడెంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తరాలపల్లి గ్రామానికి చెందిన దాసరి కార్తీక్‌యాదవ్ టై, బెల్టులను పంపిణీ చేశారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, గ్రామ మాజీ సర్పంచ్ నల్లమారి రమేష్ చొరవతో టై, బెల్టులను అందజేసినట్లు కార్తీక్‌యాదవ్ తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.రవీందర్, పేరెంట్స్ కమిటీ సభ్యులు కాల్వచర్ల నవత, కొలిపాక మంగ, మాతంగి అవంతిక, నార్లగిరి కల్పన తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ పవర్ లిఫ్టింగ్‌కు ఎంపిక

హసన్‌పర్తి: జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు వరంగల్ జిల్లా భీమారంలోని కమల్ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు ఎంపికయ్యారని తెలంగాణ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ సెక్రటరీ జోసఫ్ తెలిపారు. ఈనెల 21నుంచి 28వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో క్రీడాకారులు పాల్గొనున్నట్లు వివరించారు.

అక్రమ అడ్మిషన్లపై ఫిర్యాదు

న్యూశాయంపేట: మైనార్టీ గురుకులాల్లో అడ్మిషన్ల అక్రమాలపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనాన్ని లింక్ చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొట్ల నరేశ్ ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేశాడు. అక్రమాలపై విచారణ చేపట్టాలని బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జయశంకర్ భూపాలపల్లి గురుకులంలో అడ్మిషన్ పొందడానికి ఏకంగా మతమార్పిడి చేసి అడ్మిషన్ పొందిన ఘటనలు వెలుగులోకి వచ్చాయని, వాటిపై విచారణ జరిపించాలని నరేశ్ కోరారు.

శాకంబరీ అలంకరణ

హసన్‌పర్తి: గోపాలపురం బృందావన్ కాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయలో ఆషాఢ శుద్ధ త్రయోదశి నుంచి గురు పౌర్ణమి వరకు శాకంబరీ దేవి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈమేరకు కార్యక్రమాన్ని పురస్కరించుకుని అమ్మవారిని శాకంబరి రూపంలో గురువారం అలంకరించారు. నల్లాల విజయారెడ్డి – రాజిరెడ్డి, సాంబలక్ష్మి– డాక్టర్ సారయ్య దంపతులు పలు రకాల కూరగాయలు, ఫలాలు, పుష్పాలతో అమ్మవారిని అలంకరించారు. వివిధ కాలనీ నుంచి భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

శ్రీవిజయానిత్య అలంకరణలో..

హన్మకొండ కల్చరల్: వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న శ్రీరాజరాజేశ్వరీదేవి దేవాలయంలో నిర్వహిస్తున్న శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని శనివారం శాకంబరీదేవిగా అలంకరించనున్నట్లు ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు తెలిపారు. ఆషాఢ శుద్ధ ద్వాదశి గురువారం అమ్మవారిని శ్రీవిజయానిత్యగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ అర్చకుడు లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం నుంచి అర్చనలు, లలిత సహస్ర నామ పారాయణం చేశారు. మహాహారతి ఇచ్చి భోజన ప్రసాదాల వితరణ చేశారు.

నేడు ఎమ్మార్పీఎస్ సదస్సు

ఖిలా వరంగల్: యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరి గుట్టలో శుక్రవారం జరగనున్న ఎమ్మార్పీఎస్ సదస్సును విజయవంతం చేయాలని వరంగల్ జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ నామిండ్ల క్లైమెంట్ పిలుపునిచ్చారు. మాదిగల మోసం చేస్తున్న బీజేపీ ప్రభుత్వంపై మరో పోరాటానికి ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ నగరంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఎస్సీ వర్గీకరణ చేయాలని సూచించారు. మాదిగల ఓట్లపై గెలిచిన దేశ ప్రధాని నరేంద్ర మోదీకి మాదిగలపై ప్రేమ లేదని ఆరోపించారు.

అసెంబ్లీలో చర్చించాలి

హన్మకొండ: దళిత, గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి, రక్షణపై అసెంబ్లీలో చర్చించాలని, అంబేడ్కర్ అభయ హస్తం పథకాన్ని అమలు చేసి ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ ఒక ప్రకటనలో కోరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన దళితబంధు పథకం స్థానంలో అంబేడ్కర్ అభయ హస్తం పథకాన్ని రూ.12 లక్షలకు పెంచి అమలు చేస్తామన్న అమలు చేయడం లేదని పేర్కొన్నారు.

రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం


హనుమకొండలో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


ఆర్ట్స్ కళాశాల మైదానంలో రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం


హసన్‌పర్తి: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


కాజీపేట అర్బన్: కడిపికొండలో సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు


బొల్లికుంట రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌ను తిలకిస్తున్న అధికారులు, రైతులు

హన్మకొండ: రాష్ట్రంలో రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేస్తోందని, రైతును రాజు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర సర్కారు పని చేస్తోందని మహిళా కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు బంక సరళయాదవ్ అన్నారు. ప్రభుత్వం ఒకే రోజు రూ.లక్ష పంట రుణాలను మాఫీ చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం సంబురాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం చేశారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం బంక సరళ మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట మేరకు పంట రుణాలు మాఫీ చేస్తున్నట్లు వివరించారు. ఇది ప్రజా, రైతు ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని కొనియాడారు. గత ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ చేస్తామని దశల వారీగా చేయడంలో ఆ సొమ్ము వడ్డీలకు కూడా సరిపోలేదని విమర్శించారు. ఒకే రోజు రూ.లక్ష పంట రుణాలు మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈవీ.శ్రీనివాస్ రావు, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, తోట వెంకన్న, శ్రీమాన్, మామిడి రాజు, తాడిశెట్టి విద్యాసాగర్, సతీష్, చీకటి ఆనంద్, జక్కుల రవీందర్, విజయశ్రీ రజాలీ, ఎనుకండి నాగరాజు, పులి రాజు, బంక సంపత్ యాదవ్, మండల సమ్మయ్య పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల మైదానంలో క్షీరాభిషేకం

విద్యారణ్యపురి: రైతు రుణమాఫీని హర్షిస్తూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు గురువారం పాలాభిషేకం చేశారు. గతంలో యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వేదికగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని గుర్తుచేశారు.

రైతు రుణమాఫీపై హర్షం

హసన్‌పర్తి: రైతు రుణమాఫీపై కాంగ్రెస్ నాయకులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. హసన్‌పర్తి మండల కేంద్రంతో పాటు భీమారంలోని రైతు వేదిక వద్ద కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 22,710 మంది రైతులకు రూ.లక్ష చొప్పున రుణ మాఫీ జరిగిందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి రుణమాఫీ చేస్తున్నట్లు తెలిపారు. మూడు విడతలుగా ఆగస్టు 15లోపు అందరికీ ప్రభుత్వం రుణమాఫీ వర్తింపజేస్తుందని వివరించారు. రైతుల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్యేయం అని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు ఉదయ్‌కుమార్ రెడ్డి, గోపాల్ రెడ్డి, మేర్గు రాజేష్, మాజీ కార్పొరేటర్ వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, ఆరెల్లి వెంకటస్వామి, పొన్నాల రఘు, జె.రవి, టీఆర్‌కే రెడ్డి, ప్రేమ్, ఏరుకొండ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మదన్, పుల్లా రవీందర్, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

కడిపికొండలో..

కాజీపేట అర్బన్: రైతు రుణమాఫీని హర్షిస్తూ కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలో కాజీపేట దర్గా పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ గంగుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి గురువారం పాలాభిషేకం నిర్వహించి సంబురాలు జరుపుకున్నారు. రైతులకు అండగా నిలిచే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బస్కె శ్రీలేఖకృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నర్మెట వెంకటరమణ గౌడ్, సట్ల సదానందం, రాము, బస్కె ప్రణయ్, నర్మెట వేణు, శీలం రమేష్, నాగపూరి రాజయ్య, బత్తిని విజయగిరి, లాదల్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ఖిలా వరంగల్: రుణమాఫీ చేసి రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. ఖిలా వరంగల్ మండల బొల్లికుంట రైతు వేదిక భవనంలో గురువారం ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, మండల సొసైటీ అధ్యక్షుడు కేడల జనార్దన్, ఉపాధ్యక్షురాలు సోల్తి భూమాత, వి.సురేష్‌కుమార్, ఏడీఏ మాధవి, విద్యుత్ శాఖ డీఈ సంకేశి మల్లికార్జున్, ఏడీఈ సర్వేశ్వర్, ఏఈ సరేందర్, ఏఓ విజ్ఞాన్, ఏఈఓలు సత్యప్రకాశ్, చంద్రకాంత్, మొదటి విడతలో రుణమాఫీ పొందిన 345 మంది రైతులు పాల్గొన్నారు. అంతకుముందు సీఎం రేవంత్‌రెడ్డి కటౌట్‌కు రైతులు క్షీరాభిషేకం నిర్వహించారు.

మున్సిపల్ ఉద్యోగుల బదిలీలు నిలిపేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: ఇతర జిల్లాలకు బదిలీల నుంచి జీడబ్ల్యూఎంసీలో పనిచేస్తున్న సఫాయి కార్మికులు, జవాన్లు, అటెండర్లు, ఉద్యోగులను ఉపసంహరించాలని తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి, గౌరవ అధ్యక్షుడు ఏల్పుల ధర్మరాజు, తెలంగాణ మున్సిపాలిటీ ఉద్యోగ అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐయూటీసీ) వేల్పుల సారంగపాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, కార్మికులను మరో జిల్లాకు బదిలీ చేయాలని తీసుకున్న నిర్ణయంతో కార్మికులకు అనేక ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఉందని, వెంటనే ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం అధ్యక్షుడు మున్నంగి రఘు, బాబు, మద్దె శ్రీనివాస్, ఎ.మూర్తి రాజు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

హౌసింగ్ సొసైటీపై ఆరోపణలు

వరంగల్ చౌరస్తా: వరంగల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం, హౌసింగ్ సొసైటీపై ఆరోపణలు అవాస్తవమని అధ్యక్షుడు, మాజీ మేయర్ గుండా ప్రకాశ్ రావు తెలిపారు. వరంగల్ ఆర్ఎన్‌టీ రోడ్డులోని పట్టణ ఆర్యవైశ్య సంఘం భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఫేజ్ –1 దశ బొల్లికుంటలో 250, రెండో దశ గంగాదేవిపల్లిలో 130 మంది సభ్యులకు స్థలాలు రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు. ఆర్యవైశ్యులకు సహకారార్థం మిగిలిన సభ్యుల స్థలాలు కూడా రిజిస్ట్రేషన్ చేస్తామని పేర్కొన్నారు. ఈనెల 21న బొల్లికుంటలో ఫేజ్ –1లో రెండు బోర్లు వేసి, పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు వివరించారు.

కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ మృతి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ కారంపూడి సుభాష్ (76) అనారోగ్య సమస్యలతో ఈనెల 16న రాత్రి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో మరణించారు. ఆయన అంత్యక్రియలు స్వగ్రామం దుబ్బాకలో ఈనెల 17న జరిగాయి. ఆయన మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. కేయూలోని బయోటెక్నాలజీ విభాగంలో సుభాష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఓరుగల్లు లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం రాజీనామా

ఖిలా వరంగల్: ఓరుగల్లు లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం గురువారం రాజీనామా చేసినట్లు అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ ఫిరోజ్ అలీ, షేక్ అజ్మత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ –నర్సంపేట రోడ్డులోని ఓరుగల్లు లారీ ఓనర్స్ అసోసియేషన్ పార్కింగ్ స్థలంలో గురువారం జరిగిన కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేశారు. 2021 ఆగస్టు నుంచి 2024 ఆగస్టు వరకు పదవీ కాలం ఉన్నప్పటికి 15రోజుల ముందుగానే కార్యవర్గాన్ని రద్దు చేసి తిరిగి ఎన్నికలకు వెళ్తున్నట్లు వారు పేర్కొన్నారు.

మాక్ టెస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: ఆన్‌లైన్ ఫుల్ లెన్త్ మాక్ టెస్ట్‌లో పాల్గొనేందుకు గ్రూప్–2 పోటీ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న మైనార్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హనుమకొండ జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి మేన శ్రీను గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు కలెక్టరేట్‌లో కానీ, 73309 90322 నంబర్‌లో కానీ సంప్రదించాలని సూచించారు.

'108 ఉద్యోగుల' వేతనాలు పెంచాలి


వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలో 108 అత్యవసర సర్వీసు ఉద్యోగులకు ప్రభుత్వం ఇప్పుడు చెల్లిస్తున్న దాని కంటే 40శాతం వేతనాలను పెంచి ఇవ్వాలని, ప్రభుత్వ రెగ్యులర్, కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని రాష్ట్ర 108 ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లకావత్ బాలాజీనాయక్, దేవేందర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ డైరెక్టర్ ఆర్‌వి.కర్ణన్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 108 ఉద్యోగులు రోజుకు 12 గంటలు పనిచేస్తున్నా శ్రమకు తగిన వేతనాలు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రమను గుర్తించి 40 శాతం మేర వేతనాలు పెంచేందుకు బడ్జెట్‌లో కేటాయించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

నిరంతర గానంతో రికార్డుకు యత్నం


మాట్లాడుతున్న సిరాజుద్దీన్

నయీంనగర్: కాకతీయ మ్యూజికల్ క్లబ్ సభ్యురాలు సింగర్ సనశ్రీ తన గాత్రం ద్వారా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించడానికి 108 మల్టీ లాంగ్వేజెస్ పాటలను సాహిత్యాన్ని చూడకుండా నాన్ స్టాప్‌గా 8గంటల వ్యవధిలో పాడి రికార్డ్ నెలకొల్పనుందని, ఆ వీడియో ప్రతిని గిన్నీస్ వరల్డ్ రికార్డ్ కోసం పంపనున్నట్లు ఎండీ.సిరాజుద్దీన్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం నయీంనగర్ వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో జూలై 21న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగీత ప్రియులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో సింగర్ సనశ్రీ, తోట పూర్ణచందర్ రావు, ఎండీ.సిరాజుద్దీన్, రాంమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు


ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన తెలుపుతున్న మహిళలు

కాశిబుగ్గ: 20 రోజులుగా తాగునీరు రాకపోవడంతో విసుగెత్తిన మహిళలు రోడ్డుపై ఖాళీ బిందులు పెట్టి గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20రోజులుగా సరిపడా నీరు రావడం లేదని, ఒక్కోసారి తెల్లవారుజామున 3.30గంటలకు వస్తోందని ఆరోపించారు. ఈ విషయాన్ని పంపు ఆపరేటర్ దృష్టికి తీసుకెళ్తే పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. డివిజన్ నాయకులు దృష్టి సారించడం లేదని ఆరోపించారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

హసన్‌పర్తి: సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా పరిషత్ సీఈఓ విద్యాలత అన్నారు. హసన్‌పర్తి మండలం అర్వపల్లి, మల్లారెడ్డిపల్లి, హరిశ్చంద్రనాయక్ తండా, కొత్తపల్లి గ్రామాల్లో జెడ్పీ సీఈఓ పర్యటించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నిర్వహిస్తున్న అమ్మమాట–బడి బాట కార్యక్రమం, ఆయా గ్రామాల్లోని ఆదర్శ పాఠశాల పనుల్ని పరిశీలించారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కల జాతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అమ్మమాట–బడి బాట కార్యక్రమాల ద్వారా నమోదవుతున్న పిల్లల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. బడి మానేసిన, బడీడు పిల్లల్ని పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. సీజన్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. జ్వరం వస్తే వెంటనే స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ఆదర్శ పాఠశాలల కింద మంజూరైన పనులు సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఎంపీడీఓ ప్రవీణ్, ఏఈ అజీజ్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

గుడిసెలు కూల్చిన వారిని అరెస్ట్ చేయాలి


కూల్చిన గుడిసెలను పరిశీలిస్తున్న నాయకులు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తూ..

ఖిలా వరంగల్: పేదల గుడిసెలను కూల్చివేసిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య డిమాండ్ చేశారు. వరంగల్ భట్టుపల్లి రోడ్డులోని మల్లు స్వరాజ్యం నగర్ (టు)లో పార్టీ ఆధ్వర్యంలో వేసిన పేదల గుడిసెలను రాత్రికి రాత్రే భూ బకాసురులు జేసీబీలతో కూల్చివేశారు. నాయకులతో కలిసి కూల్చివేసిన గుడిసెలను రంగయ్య గురువారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ కబ్జాదారులపై ప్రభుత్వం చర్యలు తీసుకునేవరకు గుడిసెవాసుల సీపీఎం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ప్రభాకర్, సాజియా, జుబేదా, ఇస్మాయిల్, యాకూబ్‌పాషా, స్వరూప, దివ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని గుడిసెవాసుల ధర్నా

కాజీపేట అర్బన్: గుడిసెల కూల్చివేతపై పేదలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు కాజీపేట తహసీల్ కార్యాలయం ఎదుట సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చుక్కయ్య ఆధ్వర్యంలో 31వ డివిజన్ సర్వే నంబర్ 579లో నివాసముంటున్న గుడిసెవాసులు ధర్నా చేపట్టారు. అనంతరం పేదలకు న్యాయం చేయాలని తహసీల్దార్ భావ్‌సింగ్ నాయక్‌కు సీపీఎం నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు.

స్థానిక సంస్థల్లో బీజేపీదే విజయం


మాట్లాడుతున్న చంద్రశేఖర్

హన్మకొండ: స్థానిక సంస్థల్లో బీజేపీదే విజయమని, అవినీతి, అరాచక పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు రాష్ట్రంలో స్థానం లేదని బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. గురువారం హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో బీజేపీ హనుమకొండ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ముందుగా సమావేశం హాల్ ఆవరణలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసమావేశానికి చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 7 నెలలు దాటినా.. ఇచ్చిన హామీలను అమలు చేయక ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని విమర్శించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, నాయకులు డాక్టర్ విజయ రామారావు, మార్తినేని ధర్మారావు, అరూరి రమేష్, ఒంటేరు జయపాల్, రాజయ్య యాదవ్, పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

గీసుకొండ: ఆంక్షలు లేకుండా ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ 50 శాతం స్థానాలను గెలుచుకోవడానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. 16వ డివిజన్ ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశంలో జిల్లా మాజీ అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రాంబాబు, ఎడ్ల అశోక్‌రెడ్డి, డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న గద్దం సుధాకర్

ఖిలా వరంగల్: తెలంగాణ ఉద్యమ కళాకారులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కళాకారుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గద్దం సుధాకర్, రాజేశ్వర్‌రావు, అనుమోజు వెంకన్న కోరారు. వరంగల్ రైల్వేగేట్ శాంతినగర్‌లోని రాజశ్రీగార్డెన్‌లో తెలంగాణ నిరుద్యోగ కళాకారుల ఉమ్మడి జిల్లా సదస్సు గురువారం జరిగింది. పాలేటి రాజు, సిల్వేరు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సదస్సులో వారు మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం ఆటపాటలతో ప్రజలను చైతన్యవంతులను చేసిన వారు 550 మంది కాదని, వేలాది మంది ఉన్నారని తెలిపారు. వారందరికి అవకాశం కల్పించాలని సూచించారు. తాము కళాకారులకు అండగా ఉంటామని, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీని అమలు చేయాలని కోరారు. సమావేశంలో తండ సదానందం, లింగన్న, లింగమూర్తి, బిర్రు సురేందర్, రమేష్, చంద్ర, అంకూస్, రాజు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్ష పదవి వరంగల్‌కు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌కుమార్

ఖిలా వరంగల్: రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గానికి ఎన్నికలు అనివార్యమైతే వరంగల్‌కు అధ్యక్ష స్థానం ఇవ్వాలని ఆ మహాసభ రాష్ట్ర కార్యదర్శి వంగేటి అశోక్ కుమార్ కోరారు. వరంగల్ రైల్వే గేట్ శాంతినగర్‌లో ఆర్యవైశ్య మహాసభ జిల్లా మాజీ అధ్యక్షుడు గార్లపాటి శ్రీనివాస్ అధ్యక్షతన ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్యవైశ్యుల సమావేశంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరావతి లక్ష్మీనారాయణ నాయకత్వంపై సంపూర్ణ విశ్వాసం ఉందని అన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు, లేదా ప్రధాన కార్యదర్శిగా వంగేటి అశోక్‌కుమార్‌ను ఏకగ్రీవంగా నియమించాలని ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య మహాసభ తీర్మానం చేసినట్లు వివరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు పొద్దుటూరి గౌరీశంకర్, ప్రతాపని పాండురంగయ్య, కార్యవర్గ సభ్యుడు చిదర వీరన్న, నగర మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు, ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు గందె శ్రీనివాస్, మునిగోటి రమేష్, నాళ్ల లక్ష్మీనర్సింహరావు, శిరుప అనిల్, సిద్దంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'సుజాత కవనాల' పుస్తకావిష్కరణ



హన్మకొండ అర్బన్: తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ, గీతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కవయిత్రి సుజాత రచించిన 'సుజాత కవనాల' పుస్తకాన్ని సినీ గేయ రచయిత సాదనాల వెంకటస్వామి నాయుడు, ప్రముఖ రచయిత్రి కరాదుల అరుణ కీర్తి పతాకారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రచయిత్రి సుజాత పుస్తకంలో చాలా కవితలు స్త్రీల సమస్యలను ప్రస్తావిస్తూ పరిష్కారం చూపినట్లు తెలిపారు. కార్యక్రమంలో గోల్కొండ సాహితి కళా సమితి అధ్యక్షుడు బడే సాబ్, పుస్తక సమీక్షకులు రాధా కుసుమ, తదితరులు పాల్గొన్నారు.